ప్రజాశక్తి

సోమవారం 11 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మిగిలింది ముగ్గురే..!

నాగ జగదీష్

గవిరెడ్డి రామానాయుడు

పైలా ప్రసాదరావు

- పైలా, గవిరెడ్డి, బుద్ధకు లేని నామినేటెడ్ పదవి
- బిజెపి, జనసేనల్లో అసంతృప్తి
- ప్రాధాన్యత ఇవ్వలేదని గుర్రు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ముగ్గురు టిడిపి నాయకులకు నామినేటెడ్ పదవుల్లో స్థానం లభించలేదు. సాధారణ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి పనిచేసిన వారికి తగిన గౌరవం కల్పిస్తామని చెప్పిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆ హామీ కంటే స్థానిక రాజకీయ పరిస్థితుల ఆధారంగా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడుతోంది. మొదటి, రెండు దశల నియామకాల్లో విధేయతకు అవకాశం కల్పించారని భావించినా మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావుకు పదవి ఇవ్వకపోవడంతో ఆ విధేయత ఒక్కటే చూడలేదని అర్థమవుతోంది. నామినేటెడ్ పదవులు రాక లోలోపల నాయకుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తులను గుర్తించి సామాజిక తరగతులను పరిగణనలోకి తీసుకొని ఈసారి ముగ్గురికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడుతోంది. గత ఎన్నికల్లో టిక్కెట్ కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్య బాబులకు మొదటసారి నామినేటెడ్ ప్రక్రియలో ఛైర్మన్ పదవులు ఇచ్చారు. రెండో దఫా కూడా గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌రాని యలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావును రాష్ట్ర రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, మాడుగుల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పివిజి.కుమార్‌ను కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా చంద్రబాబు నియమించారు. అనకాపల్లికి చెందిన మళ్ల సురేంద్రకు గవర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పదవి అప్పగించారు.

అయితే... మాడుగుల నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా పోటీ చేయించి, వెనక్కు తగ్గించిన పైలా ప్రసాదరావుకు ఈసారీ నామినేటెడ్ పోస్టుల్లో చోటు దక్కలేదు. పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి సమాయత్తమవుతున్న సమయంలో పైలాను తప్పించి పెందుర్తి టిక్కెట్ రాని బండారు సత్యనారాయణమూర్తిని మాడుగుల నుంచి పోటీ చేయించారు. తనను అవమానపర్చారని కొన్ని రోజులు మిగతా 2లో..

మహాసభలో మాట్లాడుతున్న పుణ్యవతి

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలకిచ్చిన హామీలను రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం జగదాంబ జోన్ మహాసభ పార్టీ కార్యాలయంలో జరిగింది. తొలుత పార్టీ సీనియర్ నాయకులు వై.రాజు పతాకావిష్కరణ చేశారు. కె.వరలక్ష్మి, కె.చంద్రశేఖర్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మహాసభలో పుణ్యవతి మాట్లాడుతూ దేశాన్ని మతమౌఢ్యం వైపు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకెళ్తోందన్నారు. ఈ క్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను సిపిఎం కార్యకర్తలు తీవ్రస్థాయిలో ఎండగడుతూ ప్రజలలో లౌకిక భావాలను ప్రచారం చేయాలని కోరారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగాయని, కూటమి ప్రభుత్వం వీటిని అరికట్టడంలో విఫలమైందని విమర్శించారు. మహిళల రక్షణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో, రాష్ట్రంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ బిజెపి పబ్బం గడుపుకుంటోందని, దీనికి కూటమి ప్రభుత్వంలో భాగమైన టిడిపి, జనసేనలు వంత పాడుతున్నాయని విమర్శించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ప్రపంచ పరిణామాలను మిగతా 2లో..

బకాయి జీతాలు చెల్లించాలని 104 ఉద్యోగుల ధర్నాలు

వార్త 5లో..

డబ్బులు అదానీకి.. జబ్బులు ప్రజలకు..

వార్త 4లో..

హాకీ టోర్నీ విజేతలు కడప, విశాఖపట్నం

వార్త 8లో..

ప్రథమ స్థానంలో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తున్న జెవివి నాయకులు

ముగిసిన చెకుముకి సైన్స్ సంబరాలు

విజేతలకు బహుమతులు అందజేత

వార్త మెయిన్‌లో..

కార్మిక సంక్షేమానికి కృషి

'ప్రజాశక్తి'తో జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వసంతరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వసంతరావు తెలిపారు. ఇటీవల 'ప్రజాశక్తి' ఆయన్ని పలకరించినప్పుడు జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో కార్మిక శాఖ సబ్ డివిజన్లు ఎన్ని ఉన్నాయి ?

అనకాపల్లి జిల్లాలో అనకాపల్లిలో రెండు, చోడవరంలో ఒకటి, నర్సీపట్నంలో ఒకటి, యలమంచిలిలో ఒకటి ఉన్నాయి. వాటిలో సంబంధిత అధికారులంతా ఉన్నారు.

కార్మిక శాఖ పరిధిలోకి ఏయే రంగాల కార్మికులు వస్తారు ?

కార్మిక శాఖ పరిధిలోకి పిఎఫ్, ఇఎస్ఐ అమలు కాని అసంఘటితరంగ కార్మికులు కూడా వస్తారు. జిల్లాలో సుమారు 5 లక్షల మంది కార్మికులు ఉండగా వీరిలో భవన నిర్మాణ కార్మికులే సుమారు 80 వేల మంది ఉన్నారు. ఈ - శ్రమలో నమోదైన వారు సుమారు మూడున్నర లక్షల మంది ఉన్నారు.

నమోదు ప్రక్రియ ఎలా ఉంటుంది ?

ఒక్కో కార్మికుడు ఐదు సంవత్సరాలకుగాను రూ.110 చెల్లించాల్సి ఉంటుంది. దీనిలో 50 రూపాయలు అడ్మిషన్, 60 రూపాయలు ఐదేళ్లకు రెన్యువల్ నిమిత్తం చెల్లించాలి.

కార్మికుల సంక్షేమం కోసం అమలవుతున్న ప్రభుత్వ పథకాలేంటి ?

కార్మికుల సంక్షేమం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మిగిలింది ముగ్గురే..!

అసంతృప్తి వ్యక్తంచేసినా, చివరకు బండారు విజయానికి పైలా పనిచేశారు. కానీ రెండుసార్లు ప్రకటించిన నామినేటెడ్ పదవుల నియామకంలో పైలాను పక్కన పెట్టారు. చంద్రబాబు హామీతో పోటీచేయని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు ఈసారీ నామినేటెడ్ గౌరవం ఇవ్వలేదు. చంద్రబాబుకు అత్యంత విధేయునిగా వున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావుకు నామినేటెడ్ పదవి ఇవ్వకపోవడంతో అవమానపర్చినట్లుగా ఆయన అనుచరులు భావిస్తున్నారు. ఎమ్మెల్సీ పదవి ఆశించిన పీలా గోవింద సత్యనారాయణకు నామినేటెడ్ పదవితో సరిపెట్టి, బుద్ధకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలన్న యోచనతో నామినేటెడ్ పదవిని చంద్రబాబు ఇవ్వలేదన్న ప్రచారం జరుగుతోంది.

ఇదిలావుంటే రెండోసారి పదవుల్లో కూటమి ప్రభుత్వం ధర్మం తప్పిందని బిజెపి, జనసేన నాయకత్వం గుర్రుమంటోంది. ప్రస్తుతానికి బయటపడనప్పటికీ, రెండోసారి కేటాయించిన మూడు ఛైర్మన్ పదవులూ టిడిపి నాయకత్వానికి ఇవ్వడంపై అక్కడక్కడా వారిలో అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. జనసేన ఎమ్మెల్యేలు పట్టుపట్టకపోవడంతో నామినేటెడ్ పదవులు తమకు రాలేదన్న అసంతృప్తి ఆ నియోజకవర్గ జనసేన నాయకుల్లో వుంది. ఎంపీ సిఎం రమేష్ టిడిపి నాయకత్వానికి ఇచ్చిన ప్రాధాన్యత బిజెపికి ఇవ్వకపోవడంతో తమకు పదవులు రాలేదన్న విమర్శ ఆ పార్టీ నాయకత్వంలో వినబడుతోంది.

కార్మిక సంక్షేమానికి కృషి

కోసం గతంలో యాక్సిడెంట్లకు 5 లక్షలు, వైద్య ఖర్చులకు 30 వేలు, వివాహ కానుకల కింద ఎస్‌సిలు నాన్ ఎస్‌సిలను చేసుకుంటే లక్ష రూపాయలు, బిసిలు ఇతరులను చేసుకుంటే 75 వేలు చొప్పున చెల్లించేవారు. ప్రస్తుతం ఈ పథకాలను గత ప్రభుత్వం నిలుపుదల చేసింది. వీటి అమలుకు తాజా ప్రభుత్వం చర్యలు తీసుకునే దిశగా ప్రణాళికలు రూపొందిస్తోంది.

క్లెయిములు ఏమైనా చెల్లించారా ?

ప్రమాదాల్లో చనిపోయిన ఏడుగురు కార్మికులకు ఒక్కొక్కరికీ రెండు లక్షల రూపాయల చొప్పున 14 లక్షలు చెల్లించాం. కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బాల కార్మికులను గుర్తించి యజమానులపై చర్యలు తీసుకుంటున్నాం. అందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఒక కేసును గుర్తించి డిఫరెంటేజ్ అమౌంట్ యజమాని చేత కట్టించాం.

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

వివరించారు. ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్రంలోని కూటమి నాయకులు ఆ హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. విఆర్‌ఎస్ పేరుతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను తొలగిస్తున్నారని, కొందరిని ఇతర స్టీల్‌ప్లాంట్లకు బలవంతంగా పంపిస్తున్నారని అన్నారు. ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిని కల్పించారన్నారు. జగదాంబ జోన్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన మద్యం షాపుల తొలగింపునకు పోరాడి, అవి ఏర్పాటు కాకుండా సిపిఎం నాయకులు అడ్డుకోగలిగారని, ఇదే పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

తీర్మానాలివీ..

అనంతరం మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. మత్స్యకారులు, మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, పోర్టు కాలుష్యాన్ని అరికట్టాలని, దేవాదాయ శాఖకు చెందిన భూముల్లో ఏళ్ల తరబడి ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి వాటిపై చట్టపరంగా హక్కులు కల్పించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

జగదాంబ జోన్ కన్వీనర్‌గా సుబ్బారావు

అనంతరం పార్టీ జోన్ కమిటీని ఎన్నుకున్నారు. జోన్ కన్వీనర్‌గా ఎం.సుబ్బారావు, కమిటీ సభ్యులుగా కెవిపి.చంద్రమౌళి, కె.చంద్రశేఖర్, టి.నూకరాజు, ఆర్.వరలక్ష్మి, కె.గణేష్, కె.సంతోష్ ఎన్నికయ్యారు.

ఎస్‌సి మహిళలకు రుణాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ పథకం ద్వారా సెర్ప్, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఎస్‌సి కార్పొరేషన్ నుంచి ఎస్‌సి మహిళలకు రాయితీ రుణాలను అందిస్తున్నట్లు ఎస్‌సి కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ, డిఆర్‌డిఎ పీడీ తెలిపారు. ఈ మేరకు వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం ద్వారా రూ.50 వేలు సబ్సిడీతో కనిష్ట పరిమితి లక్ష నుండి గరిష్ట పరిమితి 3 లక్షలు వరకు రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18-60 సంవత్సరాల వయసు కలిగి డ్వాక్రా సంఘంలో సభ్యురాలైన ఎస్‌సి మహిళలు అర్హులని పేర్కొన్నారు.

12న మహారాణిపేట నాక్ సెంటర్‌లో జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహారాణిపేటలో ఈ నెల 12న మంగళవారం నైపుణ్య అభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నాక్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో వీల్స్‌మార్ట్, నిధి ఫైనాన్షియల్ సర్వీసెస్, పే టీమ్ కంపెనీలు పాల్గొంటాయని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9676170026 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు https://naipunyam.ap.gov.inలో వివరాలను నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జివిఎంసి నీటి సరఫరా ఎస్ఇ అక్రమాలను అరికట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

జివిఎంసి నీటి సరఫరా విభాగంలో ఎస్ఇగా పనిచేస్తున్న కెవిఆర్.రవి అవినీతి, అక్రమాలను అరికట్టాలని జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఇ రవి ఆనంద్ యూనియన్ నాయకులతో కుమ్మక్కై అడ్డగోలుగా ఉద్యోగ నియామకాలు చేస్తున్నారన్నారు. ఆయన విషయమై ఇప్పటికే జివిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తక్షణం విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు. విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న 900 మంది కార్మికులకు రవి అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ విభాగంలో మరణించడం, ఉద్యోగ విరమణ చేయడం ద్వారా ఖాళీ అయితే ఆ పోస్టులను అమ్ముకుంటున్నారని విమర్శించారు.

ఆయనపై చర్యలు తీసుకోని పక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు కె.వెంకట్రావు, సహాయ కార్యదర్శి సిహెచ్.రాజు, రమణ పాల్గొన్నారు.

చిన్నారుల కంటి సమస్యలపై వాక్‌థాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చిన్నపిల్లల్లో వచ్చే కంటి వ్యాధుల పట్ల సామాజిక అవగాహన పెంచే క్రమంలో డాక్టర్ ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యాన 'బాల్య శుక్లం' పేరుతో ఆదివారం ఉదయం బీచ్ రోడ్‌లో వాక్‌థాన్ నిర్వహించారు. కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ అబిప్సా శర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపిల్లలలో కంటి వ్యాధి లక్షణాలను త్వరగా గుర్తించడం, పిల్లలు స్పష్టంగా చూడగలిగేటట్లు త్వరగా చర్యలు చేపట్టడం తల్లిదండ్రులు చేయాలన్నారు.

వాక్‌థాన్‌లో పాల్గొన్న సంస్థ సిబ్బంది, యువతీయువకులు, చిన్నారులు

15న ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర కరువు, వలసలు, విద్య, ఉపాధి రంగ సమస్యలు-కర్తవ్యాలు అనే అంశంపై విజయనగరంలో ఈనెల 15న జరగనున్న ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును విద్యార్థులు, యువకులు, మేధావులు విజయవంతం చేయాలని పిడిఎస్ఒ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి కోరారు. ఈ మేరకు ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.రుద్ర, సతీష్ కుమార్, జానకి, మణీంద్ర, వసంత్, సురేష్, జేమ్స్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనకాపల్లి : ఈనెల 15న విజయనగరంలో జరిగే ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును, విద్యార్థి, యువకులు, మేధావులు విజయవంతం చేయాలని పిడిఎస్‌ఒ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్‌సి హాస్టల్ వద్ద సదస్సు పోస్టర్‌ను ఆదివారం పిడిఎస్ఓ అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సదస్సులో 'ఉత్తరాంధ్ర కరువు, వలసలు-విద్య, ఉపాధిరంగ సమస్యలు-కర్తవ్యాలు' అనే అంశంపై చర్చ, ప్రసంగాలు ఉంటాయన్నారు. ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును ఎస్‌టి కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ డివిజి.శంకరరావు ప్రారంభించనుండగా, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, వైవిఎస్. మహదేవన్, కె.భానుమూర్తి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పిడిఎస్ఒ జిల్లా కమిటీ సభ్యులు కె.చందు, ఎస్ గణేష్, పి ఉదయ్ కిరణ్, ఓ.మహేష్ పాల్గొన్నారు.

ఇసుక సేకరణలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి- రంపచోడవరం : రంపచోడవరం సబ్‌డివిజన్ పరిధిలో నదులు, కాలువలు, వాగుల నుంచి ఇసుక సేకరించిన వారు నిబంధనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రంపచోడవరం డిఎస్‌పి సాయి ప్రశాంత్ కోరారు. అడ్డతీగల మండలం, తిమ్మాపురం పంచాయతీ బొంగరాలపాడు గ్రామం వద్ద ఏలేరు కాలువలో ఇసుక సేకరించుటకు వెళ్లి నలుగురు వ్యక్తులు కాలువ నీటిలో మునిగి చనిపోయిన నేపథ్యంలో ఇసుక తెచ్చుకునేందుకు వెళ్లిన ప్రతిఒక్కరూ తగుజాగ్రత్తలు తీసుకోవాలని, తద్వారా ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోకుండా ఉండొచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలని, ఈత రాని వారు కాలువలు, వాగులు, నదుల్లోకి ఇసుక సేకరణకు దిగరాదని, అలాగే చీకటి పడ్డాక ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లోకి ,వాగుల్లోకి, నది పాయల్లోకి ఇసుక కోసం దిగరాదని తెలియజేశారు.

నారీశక్తి బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖలోని సీతమ్మధారలో నారీ శక్తి బ్రాంచిని వర్చువల్ విధానంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. స్థానికంగా జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రామ్ సుబ్రహ్మణ్యన్, జోనల్ హెడ్ శాలిని మీనన్, రీజనల్ హెడ్ ఆర్.నరసింహ కుమార్, బ్రాంచి మేనేజర్ ఎం.ముకుంద ప్రియ తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు తోడ్పాటును ఇవ్వటంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జ్యోతి ప్రజ్వలన చేసి బ్రాంచిని ప్రారంభిస్తున్న అతిథులు

ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. నారీశక్తి ప్రత్యేక బ్రాంచి ఏర్పాటు ద్వారా మహిళలు పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపార వేత్తలుగా రాణించడానికి రుణ సదుపాయం సులువుగా కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, డిప్యూటీ రీజనల్ హెడ్ పిజిఆర్.నాయుడు, రమేష్, ఉదయ్ భాస్కర్, చీఫ్ మేనేజర్ జిజికెఎస్.నాయుడు, వివిధ బ్రాంచిల మేనేజర్లు, సుచిత, స్మిత, సిహెచ్.రమేష్, జి.ఉమాపతి, బి.వినయ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు గాజువాక
I.A No. /2024 in I.P. No. 6 / 2023

పిటీషన్:
పోలిరెడ్డి పోతురాజు @ రాజు
...పిటీషనర్

అండ్:
ఈర్ల వెంకటరావు & 19 ఆదర్స్
...రెస్పాండెంట్స్

నోటీసు
R 13. యస్.రాజేశ్వరి, W/o. కామేశ్వరరావు R/at డో.నెం.10-5-67, మోడ్రన్ టైలర్స్ కన్య, శ్రీకన్య థియేటర్ ఎదురువీధి, కైలాస్‌నగర్, గాజువాక, విశాఖపట్నం-26.

ఇందుమూలంగా మీకు తెలియజేయనది ఏమనగా పైకేసులో 13వ రెస్పాండెంట్ అయిన మీరు హాజరు నిమిత్తం **తేదీ:28-11-2024కి** శ్రీ కోర్టు వారు వాయిదా వేసి యున్నారు. కావున యీ ప్రకటన నోటీసుగా భావించి పై తేదీన పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం. 10-30లకు** స్వయంగా గాని ప్లీడరు ద్వారా గాని హాజరై వాదనలు చేసుకోవలెను. లేనిచో పై కేసు మీ పరోక్షమున తీర్మానించడమగును.

యమ్.రామకృష్ణ
యమ్.జ్యోత్స్న
అడ్వకేట్స్, హైస్కూల్‌రోడ్,
గాజువాక. సెల్: 7780503464

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి -తగరపువలస : ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రయివేట్ స్కూల్ బస్ డ్రైవర్లు, క్లీనర్లకు భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్ చిరంజీవి సూచించారు. స్థానికంగా ఉన్న పలు ప్రయివేటు స్కూళ్ల బస్ డ్రైవర్లు, క్లీనర్లకు ఆదివారం అవగాహన కల్పించారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించి తీసుకువెళ్లొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఆలయ ప్రారంభానికి, విగ్రహ ప్రతిష్టకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ సన్యాసమ్మ, సత్యనారాయణ దంపతులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం ప్రారంభానికి అందరూ హాజరు కావాలని కోరారు. 13న అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

స్కౌట్స్ విద్యార్థుల సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్పి హైస్కూల్ స్కౌట్స్ విద్యార్థులు ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటుచేసిన సైకిల్ ర్యాలీని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మురళీధర్, స్కౌట్ ఉపాధ్యాయులు టిఎస్‌వి.ప్రసాదరావు ప్రారంభించారు. స్కౌట్ విద్యార్థులకు వివిధ ఉద్యోగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తాయని వివరించారు. ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ ఐటి, నీట్, రైల్వేస్‌లో ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందని వివరించారు.

మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

కెజిబివిలో మొక్కల నాటివేత

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని నేలతేరు కెజిబివి జూనియర్ కళాశాలలో ఆదివారం మొక్కలు నాటారు. భారత ప్రభుత్వ యువజన క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రు యువ కేంద్రం ఆధ్వర్యాన కెజిబివిలో ఏక్ పేడ్ మా కి నామ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ ఎన్ఎస్ఎస్ నేషనల్ అవార్డు గ్రహీత ఆర్.లీలాప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, మొక్కలు నాటడం ద్వారా పర్యావరణానికి ఎంతో మంచిదని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఇంధన వాహనాలతో వాతావరణ కలుషితమవుతుందని, దీని నివారణకు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొండ చిలువలు విడుదల

ప్రజాశక్తి - అరిలోవ : ఎండాడ, ఆర్ అండ్ బి, విమాన నగర్‌లో 20 రోజుల కిందట పట్టుకున్న కొండచిలువలను జివిఎంసి స్నేక్ కేచర్ కిరణ్ ఆదివారం కంబాల కొండలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు పాములంటే చాలా ఇష్టమని, వీటి ఆరోగ్య పరంగా మందులు వాడి ఆదివారం విడిచి పెట్టానని చెప్పారు. ఇప్పటివరకు తాను ఒడిశాతో కలిపి 30వేలు పాములు పట్టుకున్నట్లు చెప్పారు. ఎక్కడైనా పాములు కనిపిస్తే చంపవద్దని, 98491-40500 నెంబర్‌కు కాల్ చేస్తే వచ్చి పట్టుకుని అడవుల్లో విడిచిపెడతామని చెప్పారు.

పేదల ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి -మధురవాడ : పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు కోరారు. ఎన్నికల వాగ్దానం మేరకు పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇస్తామని చెప్పిన హామీ నిలబెట్టుకుంటామని చంద్రబాబు ప్రకటించడాన్ని సిపిఐ స్వాగతిస్తోందని పేర్కొన్నారు. జివిఎంసి 5వ వార్డు పరిధి నగరంపాలెంలో ఇంటింటికీ వెళ్లి ఇళ్లు లేనివారికి, గతంలో వైసిపి ప్రభుత్వం ఒక సెంటు చొప్పున 50 కిలోమీటర్ల దూరంలో ఇచ్చిన వారికి దరఖాస్తులు అందించారు. ఈ దరఖాస్తులను ఈ నెల 18వ తేదీన వార్డు సచివాలయ కార్యదర్శికి ప్రజలతో అందిస్తామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందించేదని, ఇది ఎటూ చాలేదికాదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రూ.4లక్షలు ఇస్తామని చెప్పిందని, రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సిపిఐ ఆధ్వర్యాన వారం రోజులు పాటు రాష్ట్ర వ్యాపితంగా ఈ కార్యక్రమం నిర్వహించి ఈ నెల 18 నుంచి సచివాలయ కార్యదర్శులకు ప్రజలచేత అందజేపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, పి.రమణ, కె.చిన్న, ఎన్.త్రినాథ్, షేక్ కాళీషా తదితరులు పాల్గొన్నారు.

'గుడిలోవ'లో గణిత దశావధానం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార పాఠశాలలో గణిత దశావధానం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు గణితంపై ఉన్న భయాన్ని తొలగించి, ఆసక్తి రేకెత్తించుటకు గణిత దశావధానం ఎంతో దోహద పడుతుందని శ్రీకాకుళం జిల్లా, కంచిలి మండలానికి చెందిన ప్రముఖ గణిత అవధాని మడ్డు తిరుపతిరావు మాస్టర్ తెలిపారు. గుడిలోవ విజ్ఞాన విహార రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణంలో ప్రిన్సిపల్ ఎం.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన గణిత అవధానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ చరవాణి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరూ దాని మోజులో పడి జ్ఞాపక శక్తిని పోగొట్టుకుంటున్నారన్నారు. శర్మ మాస్టర్ మాట్లాడుతూ గణితంలో వేగం, ఖచ్చితత్వం పెంపొందించుటకు ఈ గణిత అవధానం ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ సందర్భంగా అవధాని మడ్డు తిరుపతి రావు మాస్టర్‌ను పాఠశాల యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో డొక్కరి హరికృష్ణ, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గిడిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2014-15 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనందపురం ఎంఇఒ-2 గంగరాజు మాట్లాడుతూ, విద్యార్థులు ఎంత ఉన్నత స్థితికి వెళ్లినా ఉపాధ్యాయులకు పిల్లలే అన్నారు. ఈ సమ్మేళనం సమాజ సేవకు నాంది కావాలన్నారు. విద్యార్థులు ఉన్న స్థితికి చేరుకుంటే తల్లిదండ్రులతో పాటు విద్య అందించిన ఉపాధ్యాయులకు ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకొని సమాజ, దేశ అభివృద్ధికి తమ వంతు సేవలందించాలని సూచించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు శినగం రాజా త్రివేణి, శినగం స్వాతి, శినగం తులసి, కంది సురేష్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో భవిష్యత్తులో ఐక్యంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టడంతోపాటు ఒకరికి ఒకరు కష్ట సుఖాల్లో తోడు ఉంటామని ప్రతిజ్ఞ చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ప్రధానోపాధ్యాయులు ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, గొర్లి కృష్ణ, చైతన్య, రమేష్, 17 మంది ఉపాధ్యాయులు, 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకే చోట సమావేశమైన గిడిజాల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు రాజవీధిలో ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తమ్మిన సూరిబాబు, పిట్ట సురేష్, చిలకా నరసింగరావు, కొప్పల కృష్ణ, గరే చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి రాజీవ్ గృహకల్ప, అంబేద్కర్ కాలనీ, శారదానగర్, స్వయంకృషినగర్, వైఎస్ఆర్‌నగర్, స్వతంత్రనగర్, నగరంపాలెంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు, నాగోతి వెంకట సత్యనారాయణ, వాండ్రాసి అప్పలరాజు, నమ్మి శ్రీను, ఓలేటి శ్రావణ్, మకర రవికుమార్, ఈగల అప్పలనాయుడు, గండి రామ్‌నాయుడు, నాగోతి అనిత, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి వివేకానంద నగర్, ఇందిరానగర్, సుందరనగర్, ఆదర్శనగర్, ఎస్ఐజి.నగర్‌లో గడు అప్పలనాయుడు ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దిల రాజశేఖర్, మద్దిల రాజేష్, మొల్లి అప్పారావు, అప్పలనాయుడు, దొంగ నరేష్ కుమార్, శ్రీనివాస్, కాళ్ల శ్రీనివాస్, బుగత తాతారావు, ధన లక్ష్మి, గురజాపు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : టిడిపిలో ప్రతి కార్యకర్తా సభ్యత్వనమోదులో భాగస్వాములై, ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం చేపట్టి విజయవంతం చేయాలని నియోజవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ముఖ్య కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో జరిగిన సభ్యత్వ నమోదు చేపట్టారు.. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి కాండ్రకోన చిరంజీవి, పార్టీ మండల అధ్యక్షులు ఇత్తంశెట్టి రాజు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు గొన్నాబత్తుల శేషు, రాయి కృష్ణ, పూడి రామకృష్ణ, దేవరపు మోహనరావు, కర్రి సింహాచలం పాల్గొన్నారు.

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయికృష్ణ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు, సంత బయలు, పల్లపు వీధి ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. సభ్యత్వ నమోదుతో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో దాడి శివ, పెంటకోట శ్రీరామమూర్తి, కాండ్రేగుల పరదేశి నాయుడు, విల్లూరి నూకనర్సింగరావు, దాడి భీమి నాయుడు, వేగి దేవత నాయుడు, విల్లూరి సాయిరాం ,వెలగా మురళి, సూరిశెట్టి కన్నబాబు, టెక్కలి పరుశురాం పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో నియోజవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి కాండ్రకోన చిరంజీవి, పార్టీ మండల అధ్యక్షులు ఇత్తంశెట్టి రాజు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు గొన్నాబత్తుల శేషు, రాయి కృష్ణ, పూడి రామకృష్ణ, దేవరపు మోహనరావు, కర్రి సింహాచలం పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భవనం పై నుంచి పడి విద్యార్థిని మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తూ భవనంపై నుంచి పడి విద్యార్థిని మృతి చెందినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఘటనకు సంబంధించి సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 5వ వార్డు పరిధి శివశక్తి నగర్ రోడ్డులో భద్రాచలం తన భార్య ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. మర్చంట్ నేవీలో భద్రాచలం విధులు నిర్వహిస్తున్నారు. అతని కుమార్తె గాయత్రీ (23) నగరంలోని ఓ కళాశాలలో బిబిఎ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆదివారం ఉదయం నాలుగో అంతస్తు నుంచి కింద పడిపోయింది. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలు తల్లి ఉషారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి మృతి చెందినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. జివిఎంసి 8వ వార్డు పరిధి ధర్మపురి కాలనీకి చెందిన చల్ల అజయ్ దిలీప్ (26) ఇన్ఫోసిస్‌లో పనిచేస్తున్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. క్రికెట్ స్టేడియం సమీపంలో మధురవాడ నుంచి నగరం వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఆయన్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అజయ్ దిలీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

పెట్రోల్ బంక్ పక్కన మృతదేహం

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని పోతిరెడ్డి పాలెం వద్ద పెట్రోలు బంకు పక్కన ఆదివారం ఉదయం మృతదేహం పడివుంది. దాని పక్కనే నిర్మాణంలో ఉన్న దక్కన్ సిమ్మెంట్ కంపెనీ సెక్యూరిటీ గార్డు ఆ శవాన్ని గమనించి పోతిరెడ్డి పాలెం విఆర్‌ఓకు సమాచారం అందించారు. వీఆర్ఓ నేరస్థలాన్ని పరిశీలించి, కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతుని జేబులో దొరికిన ఆధారాలు పరిశీలించారు. మృతుడు తెలంగాణ రాష్ట్రం, యాదాద్రి భువనగిరి జిల్లా , భువనగిరి మండలం, బస్వాపురం వాసి పాముల చందు (36)గా గుర్తించారు. విఆర్ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ వచ్చి పరిశీలించింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మరణానికి కారణం, చనిపోయి ఎంతకాలం అయిందీ తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

ఏ కష్టమైనా ఆదుకుంటాం : గ్లోబల్ ఫౌండేషన్

ప్రజాశక్తి -పద్మనాభం : ఎవరికి ఏ కష్టం వచ్చినా గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటామని ఫౌండేషన్ చైర్మన్ భూపతిరాజు పండిట్ తెలిపారు. మండల పరిధి పాండ్రంగి గ్రామంలోని అల్లూరి సీతారామరాజు నివాస గృహంలో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన నిరుపేదలకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. అమెరికాలో పనిచేస్తున్న ఈయన, కొంతమంది తెలుగు వైద్యులు కలిసి ఈ ఫౌండేషన్‌ను ఏర్పాటుచేసినట్లు భూపతిరాజు పండిట్ వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 75 గ్రామాలను ఫౌండేషన్ దత్తత తీసుకొని, మౌలిక సదుపాయాలు కల్పన, నిరుపేదలకు విద్య, వైద్య పరంగా ఆదుకునే లక్ష్యంతో సంస్థను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇప్పటికే 25 గ్రామాలను దత్తత తీసుకున్నామన్నారు. ఈ ప్రాంతంలో పాండ్రంగి, రేవిడి, అలమండ, జొన్నవలస గ్రామాలను మాతృభూమి ప్రేమతో తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ముందుగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు, ప్రశాంత్‌రాజు రామరాజు, మాజీ సర్పంచ్ పల్లి మహేష్, ఎంపిటిసి మాజీ సభ్యులు వెంకట్రావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేములవలసలో దీపోత్సవం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలస పూల మార్కెట్ పక్కన జిఎస్ఎన్ ఫంక్షన్ హాల్లో బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం దీపోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది. 11, 12 తేదీలలో కార్తీక దీపోత్సవం, ద్వాదశ జ్యోతిర్లింగ దివ్య దర్శనాలను భక్తులకు కల్పిస్తున్నట్లు బ్రహ్మకుమారీస్ తెలిపారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి-సీతమ్మధార : భారత రాజ్యాంగాన్ని మార్చివేసే ప్రయత్నాలు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ చీఫ్ సెక్రటరీ జనరల్ ఎం.నరసింగరావు పిలుపునిచ్చారు. నగరంలోని రామా టాకీసు సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్, ఆల్ ఇండియా డిఫెన్స్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన సదస్సును నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, బుద్ధుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎం.నరసింగరావు మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం.. భారతదేశాన్ని కాపాడుకుందాం.. పిలుపుతో త్వరలో దేశంలోని పలు రాష్ట్రాలలో రాజ్యాంగ అవగాహన రథయాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. యాత్ర పోస్టర్‌ను కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ రథయాత్ర ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర మీదుగా నాగపూర్ దీక్ష భూమికి చేరుకుంటుందని చెప్పారు. యాత్రలో దళిత, బహుజన, ప్రజాస్వామిక సంఘాలన్నీ భాగస్వామ్యం అవుతున్నాయని తెలిపారు. ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి మాటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికపై గొప్ప రాజ్యాంగాన్ని దేశ ప్రజలకు అంబేద్కర్ అందించారని తెలిపారు. దీని ద్వారా అనేక హక్కులు, అవకాశాలు దేశ ప్రజలందరికీ వచ్చినప్పటికీ రాజ్యాంగాన్ని మనవాద పాలకులు మార్చివేసే ప్రయత్నం చేయటం దారుణం అన్నారు. దళిత, బహుజన, రాజ్యాధికారంతోనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఆంధ్ర యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పొందిన డాక్టర్ మాటూరి రత్నకుమారిని సన్మానించారు. డాక్‌యార్డు జనరల్ యూనియన్ కార్మిక నాయకునిగా గెలిచిన రమణమూర్తిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు జి.శంకర్, ఎస్.రామలింగం, మునికుమార్, జాన్ పాల్, ఎం.రాజ్‌కృష్ణ, బొడ్డు కల్యాణరావు, డి.భూపతి తదితరులు పాల్గొన్నారు.

'దేశానికి నెహ్రూ సేవలు మరువలేనివి'

ప్రజాశక్తి-సీతమ్మధార : స్వాతంత్ర్య సమరయోధునిగా, ప్రథమ ప్రధానిగా భారతదేశానికి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువరానివని వక్తలు పేర్కొన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాల వికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్తాధ్వర్యాన ఆదివారం డాక్టర్ ఎల్‌బి.కాలేజీ ఆవరణలో 'నెహ్రూ- భారతదేశం' అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఆచార్య పి.పద్దయ్య, సీనియర్ అడ్వకేట్ సి.ఎస్.పి.కృష్ణారావు మాట్లాడుతూ, ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణం, పంచశీల విధానం, ప్రపంచ శాంతి స్థాపనలో, ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణంలో నెహ్రూ కృషిని కొనియాడారు. కొందరు పనిగట్టుకొని నెహ్రూను, గాంధీని సోషల్ మీడియోలో అసహ్యకరంగా చూపించడం, మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ప్రకటించారు. బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ బాబ్జి, మున్నార్, ద్విభాష్యం రాజేశ్వరరావు, జెపి.శర్మ, హుస్సన్, రచయత ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి బంటాకాలనీలోని ఓ ఇంటిలో గ్యాస్ లీకైన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మీసాల పైడమ్మ కుటుంబానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సహాయం అందించారు. వార్డు పర్యటనలో పిన్నింటి పార్వతి ద్వారా విషయం తెలుసుకొని బాధితురాలిని ఎమ్మెల్యే పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సహాయంతోపాటు మూడు నెలలకు సరిపడా రేషన్ సరుకులను అందించారు. ప్రభుత్వం నుంచి కూడా తగిన సహకారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

డబ్బులు అదానీకి.. జబ్బులు ప్రజలకు...

సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక : డబ్బులు అదానికి, జబ్బులు మాత్రం ప్రజలకని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. గంగవరం పోర్టు కాలుష్యం నియంత్రించాలని, పోర్టు నిర్వాసిత ప్రాంతాలను గంగవరం పోర్టు యాజమాన్యం దత్తత తీసుకొని సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందించాలని తదితర డిమాండ్లతో గాజువాక వై.జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ, గంగవరం పోర్టు కాలుష్యం వల్ల సుమారు 20 గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఇటీవల కేన్సర్ బాధితులు చాలా ఎక్కువ అయ్యారని, గుండె, ఊపిరితిత్తులు, చర్మవ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా పోర్టు యాజమాన్యం మాత్రం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అధికారానికి వస్తే గంగవరం పోర్టు కాలుష్యం నిర్మూలిస్తానని, వై జంక్షన్ ద్వారా వస్తున్న భారీ వాహనాలు రూటు మళ్లిస్తానని ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చినా గంగవరం పోర్టు కాలుష్యంపై ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే గంగవరం పోర్టు యాజమాన్యంపై చర్యలు తీసుకుని కాలుష్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దీర్ఘకాలిక పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి.రమణ, వార్వా నివాస్ అధ్యక్షులు త్రినాధస్వామి, గొలగాని అప్పారావు, గణేష్, జి.లక్ష్మి, బి.రమణ, రాము తదితరులు పాల్గొన్నారు.

వై.జంక్షన్ వద్ద ధర్నా చేస్తున్న గంగవరం పోర్టు నిర్వాసితులు

500 మందికి ఉచిత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -మాధవధార: సంఘ సేవకులు, కీర్తిశేషులు సనపల సూర్యనారాయణ 18వ వర్ధంతి సందర్భంగా మాధవధార కళింగయూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి సౌజన్యంతో జివిఎంసి 50వ వార్డు పరిధి తెన్నేటినగర్ పార్కులో ఆదివారం మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. 500 మంది కి పైగా రోగులకు బిపి, సుగర్, ఈసీజీ, 2డి ఎకో తదితర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా 50 మంది రక్తదానం చేశారు. అనంతరం కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణమూర్తిని మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి మాట్లాడుతూ, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నంబాల ఈశ్వరరావు, అసోసియేషన్ వ్యవస్థాపకులు సనపల శ్రీకాంత్ మాట్లాడుతూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ అధ్యక్షులు సనపల వరప్రసాద్, అసోసియేషన్ కార్యదర్శి తమ్మినేని వెంకటేష్, సనపల శ్రీకాంత్, సనపల వెంకట్రావు, అన్నెపు రవి, పూజారి సురేష్, సనపల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలందిస్తున్న డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి

రోడ్డుపైనే వాహనాలు.. ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : రోడ్డుపైనే వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. పెందుర్తి నుంచి ఆనందపురం వచ్చే సర్వీస్ రోడ్డులో పూల మార్కెట్ సమీపంలో నిత్యం కార్ల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్ పోలీసులు అపరాధ రుసుము విధిస్తున్నప్పటికీ వాహనదారులు భయపడడం లేదని స్థానికులు చెబుతున్నారు. వాహనదారులు మార్కెట్ వద్ద వాహనాలను ఆపి కావలసిన వస్తువులను కొనుగోలు చేసుకోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం తప్పడంలేదు. ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి పార్కింగ్ ప్రాంతంలో మాత్రమే వాహనాలను నిలుపుదలచేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపైనే నిలిపి ఉంటున్న వాహనాలు

తిరుపతిరావు, మునీశ్వర్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి- గాజువాక : స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగ విరమణ చేసిన మాజీ డిజిఎం వి.తిరుపతిరావు, జనరల్ ఫోర్‌మెన్ పి.మునీశ్వర్‌రెడ్డి దంపతులను తోకాడలోని సమైఖ్య అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వి.తిరుపతిరావు ఒకపక్క ఉద్యోగం చేస్తూ మరోపక్క సామాజిక సేవ చేశారని గుర్తుచేశారు. శారదా ట్రస్ట్ ద్వారా గిరిజన ప్రాంతాల్లో మంచినీరు, విద్య అందించడమే బాధ్యతగా పనిచేస్తున్నారని తెలిపారు. మునీశ్వర్‌రెడ్డి క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అన్నారు. చిత్తూరు జిల్లాలో జన్మించిన మునీశ్వర్‌రెడ్డి బిహెచ్ఇఎల్, రైల్వేలో ఉద్యోగాలు చేసి చివరికి విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పూర్తిస్థాయిలో పనిచేశారని చెప్పారు. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఒత్తిడితో కూడుకున్న జీవితం ఏర్పడిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

సన్మాన గ్రహీత వి.తిరుపతిరావు మాట్లాడుతూ, తాను మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించానని చెప్పారు. 1979లో 8వ తరగతి చదువుతున్నప్పుడు తన తండ్రి వైజాగ్‌లోని హాస్టల్లో వేశారని, పదో తరగతి వరకు ఆ హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నానని తెలిపారు. తర్వాత వైజాగ్‌లోనే పాలిటెక్నికల్ పూర్తి చేసినట్లు చెప్పారు. అనంతరం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగంలో చేరినట్లు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగం చేస్తూ సిఐటియులో చేరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ ఎ.తవిటయ్య, ఉపాధ్యక్షులు తౌడన్న, కమిటీ సభ్యులు రామన్న, మహిళా సభ్యులు వరలక్ష్మి తదితరులు మాట్లాడారు.

తిరుపతిరావు, మునీశ్వర్‌రెడ్డి సన్మాన కార్యక్రమంలో తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నాయకులు

బకాయి జీతాలు చెల్లించాలని

104 ఉద్యోగుల ధర్నాలు

అనకాపల్లిలో 104 ఉద్యోగుల ధర్నాలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : 04 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం అనకాపల్లి సిఐటియు కార్యాలయం నుండి నెహ్రూ చౌక్ వరకు ప్రదర్శన నిర్వహించి, అక్కడ శిబిరంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జి. కోటేశ్వరరావు, 104 యూనియన్ గౌరవాధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ పేదలకు 16 ఏళ్లుగా సేవలను అందిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు పట్ల ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం తగదన్నారు. అరబిందో యాజమాన్యం జిఒ7 ను అమలు చేయకుండా, ఏరియర్స్, ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 104 సర్వీసులును ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో 104 డ్రైవర్లు, డిఒఒలు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు కంటే చాలా తక్కువ వేతనాలతో పని చేస్తూ అన్యాయానికి గురవుతున్నా రన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే సమస్యలు పరిష్కారం చేయక పోతే రాబోయే రోజుల్లో మా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 104 నాయకులు ఎం. నాగసాయి, ఆర్. అప్పల రమణ, జి. చంద్రుడు, ఎస్ సూర్య కళ, ఏ. మనీష్, ఎస్. భార్గవ, మూర్తి, కిషోర్, శివ లక్ష్మి, మధు, మనీషా, చిరంజీవి, జిల్లా వ్యాప్తంగా 104 ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని 104 ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ 104 ఉద్యోగులకు బకాయి ఉన్న జీతాలను ప్రభుత్వం తక్షణం చెల్లించాలన్నారు. ప్రభుత్వమే నేరుగా పిహెచ్‌సిల ద్వారా 104 సర్వీసులను నిర్వహించాలని, 2020 తర్వాత నియమించబడిన వారికి జిఒ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పిఎఫ్‌లో యాజమాన్యం వాటా యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాల అలవెన్సులు, ఇంక్రిమెంట్ల బకాయిలు చెల్లించాలన్నారు. వాహనాల నిర్వహణ మరమ్మతులను తక్షణం చేపట్టాలని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని కోరారు. నిరసన దీక్షకు సిఐటియు జిల్లా నాయకులు జి.అప్పలరాజు, 104 ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాతబాబు, భాస్కర్, నాయకులు భవ్య, ప్రకాష్‌లు నాయకత్వం వహించారు.

విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 104ఉద్యోగుల ధర్నా

సిపిఎం మండల కన్వీనర్‌గా రాము

ఆర్.రాము

ప్రజాశక్తి -అచ్యుతాపురం : సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్‌గా ఆర్.రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హరిపాలెం గ్రామంలో నిర్వహించిన మండల మహాసభలో మండల కమిటీ ఎన్నిక జరిగింది.కన్వీనర్‌గా రామును ఎన్నుకోగా, మండల కమిటీ సభ్యులుగా కర్రిఅప్పారావు, కె సోమునాయుడు, బి రామ్‌కుమార్, ఎస్ రామునాయుడు, చేపల తాతయ్య, బి జయలను ఎన్నుకున్నారు.

ఈసందర్భంగా మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ ఈనెల 15 వరకు సిపిఎం ప్రజాపోరులో భాగంగా పెరిగిన ధరలకు నిరసనగా ప్రజలు, కార్మికులు, రైతులు, వృత్తిదారులు, దళితులు, చిల్లర వర్తకులతో విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఎన్‌టిపిసిని సందర్శించిన ఆర్‌ఇడి

జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభిస్తున్న ఆర్‌ఇడి

ప్రజాశక్తి - పరవాడ: ఎన్‌టిపిసి సింహాద్రిని రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సౌత్) కేదార్ రంజన్ పాండు శని, ఆదివారాల్లో సందర్శించారు. ఆర్‌ఇడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ప్లాంట్ సందర్శించిన ఆయనకు సింహాద్రి హెచ్‌పి ఎస్.కె సిన్హా స్వాగతించారు. ఈ సందర్భంగా సింహాద్రి ప్రాజెక్ట్‌పై సమగ్ర సమీక్ష నిర్వహించారు. హెచ్ఒడీలతో పాటు యూనియన్, ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్, ఎస్‌సి, ఎస్‌టి ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులతో పరస్పర చర్చలు జరిపారు.కంట్రోల్ రూమ్, సిహెచ్‌పిడబ్ల్యుటి ఏరియా, ఎఫ్‌జిడిలను సందర్శించి, అక్కడ కార్యకలాపాలు, కొనసాగుతున్న మెరుగుదలలను సమీక్షించాడు.

ఆదివారం ఆర్‌ఇడి సౌత్ ఎన్‌టిపిసి సింహాద్రిలోని జీవన్ రేఖ హాస్పిటల్‌లోని 'సజనం చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా సందర్శించి, అక్కడి కార్యకలాపాలపై సమీక్షించారు. పిల్లలు, వారి తల్లిదండ్రులతో సంభాషించారు. సింహాద్రి ఎన్‌టిపిసి స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని సినీ గాయకుడు శ్రీరామ చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కల్చరల్ ఈవెంట్‌ను తిలకించారు. ఎన్‌టిపిసి సింహాద్రి సాధన క్రీడా మైదాన్‌లో ఎన్టిపిసి లిమిటెడ్ రైజింగ్‌డే గోల్డెన్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని వైబ్రెంట్ సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఉద్యోగులు, వారి కుటుంబాలు, స్థానిక ప్రముఖులు సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎన్‌టిపిసి ఉద్యోగులు సంగీతం, నృత్య ప్రదర్శనలు అలరించాయి.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు

సమావేశంలో మాట్లాడుతున్న పీలా గోవింద

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభిస్తుందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని తుమ్మపాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం ప్రశ్నించిన వారికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ అనేక పదవులు ఇచ్చిందన్నారు. అలాగే పార్టీ సభ్యత్వ నమోదులో ఎక్కువ మందిని చేర్పించాలన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీ శ్రేణులు చదరం నాగేశ్వరరావు, కర్రి బాబి, రాపేటి రామ్ కుమార్, ఆడారి గోవిందరావు, నడిపల్లి బోసు బాబు, చదరం కాశి, పీలా విశ్వేశ్వరరావు, పీలా తాతు నాయుడు, బొడ్డపాటి రాజారావు, వియ్యపు సింహాచలం, సందిన సునీల్, పెతకంశెట్టి బలరాం పాల్గొన్నారు.

దాహార్తితో ప్రజల గగ్గోలు

- మున్సిపాలిటీలో మూడు రోజులుగా నీరివ్వని కుళాయిలు
- ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా : పూర్తిస్థాయిలో నీరందక ఇక్కట్లు

అయ్యప్పగుడి ప్రాంతంలో ట్యాంకర్ ద్వారా మంచినీటి సరఫరా

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి పట్టణ ప్రజలు దాహార్తితో అల్లాడిపోతున్నారు. పురుషోత్తపురం వద్ద పైప్‌లైన్ పగిలి పోవడంతో మూడు రోజులుగా యలమంచిలి వాసులకు కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా నిలిచిపోయింది. శనివారం నాటికి రిపేరు పనులు పూర్తవుతుందని భావించినప్పటికీ పూర్తికాలేదు. దీంతో ఆదివారం కూడా కుళాయిలు నోరెళ్లబెట్టాయి. అయితే ప్రత్యామ్నాయంగా రెండు మున్సిపల్ వాటర్ ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. నాలుగు వేల లీటర్ల కెపాసిటీ గల రెండు ట్యాంకర్లు రోజుకు నాలుగైదు ట్రిప్పులు నీటి సరఫరా చేస్తున్నప్పటికీ, ప్రజల అవసరాలకు తగ్గటుగా నీటిని అందించలేకపోతున్నాయి. ఎంత ప్రయాస పడినా రెండు ట్యాంకర్లు కలిపి నాలుగు లక్షల లీటర్ల కంటే ఎక్కువ మంచినీటిని అందించలేకపోతున్నారు. పట్టణ ప్రజల అవసరాల కోసం ప్రతినిత్యం సుమారు ఎర్రవరం సంపులద్వారా 11 లక్షల లీటర్లు నీరు పంప్ చేస్తుంటారు. సోమిదేవుపల్లి వరాహ నదిలో వేసిన బోర్లద్వారా ఇక్కడకు చేరుకుంటాయి. మంచినీటి కోసం ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయించి కొనుక్కుంటున్నారు. అక్కడ కూడా రద్దీ ఏర్పడింది. ఊరికి కాస్త దూరంగా ఉన్న టిడ్కో, రామనగర్‌ప్రాంతాలకు ట్యాంకర్ నీరు సరఫరా కాలేదని స్థానికులు ప్రజాశక్తికి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కుళాయిల ద్వారా మంచినీరు అందని రోజుల్లో మున్సి పాలిటీ మరో రెండు ట్యాంకర్లను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుకుంటున్నారు .

అపూర్వ కలయిక

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో నరసింగపల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక ఆదివారం జరిగింది ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అందరూ ఎంతో ఉల్లాసంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అలనాటి తీపి గుర్తులు నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. తాము, చదివిన పాఠశాలకు కలర్ ప్రింట్ మిషన్ ఆందించారు. కార్యక్రమంలో నర్సింగపల్లి, గొబ్బూరు, నూతన గుంట పాలెం, నల్ల మారమ్మ గుడి, సోమవారం తదితర గ్రామాల నుంచి పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

అనకాపల్లి రైల్వేస్టేషన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతా

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర నిధులతో అనకాపల్లి రైల్వే స్టేషన్ మోడల్ స్టేషన్‌గా తీర్చి దిద్దుతామని, లక్ష్మీదేవి పేట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ అన్నారు. ఆదివారం అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, ఇతర కూటమి నాయకులతో స్టేషనును పరిశీలించారు. రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, రైల్వేస్టేషన్ అభివృద్ధికే ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. స్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలించి, త్వరతగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రైల్వే ప్రయాణికులు, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, ౖ ౦ల్వే అధికారులు పాల్గొన్నారు.

ఒంపోలులో హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ సభ్యులైన పాడి రైతులకు ఏటా రెండు బోనస్‌లు చెల్లిస్తున్నట్లు డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు తెలిపారు. ఆదివారం ఒంపోలు గ్రామంలో నూతన పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాల రైతుల సంక్షేమ ధ్యేయంగా హెరిటేజ్ డెయిరీ సేవలందిస్తోందన్నారు. అధిక పాలధరతో పాటు పశు వైద్యం, పాడిపశువులకు, పాడి రైతులకు బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజిక్షన్లను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డెయిరీ సూపర్వైజర్ జి గోవిందు, యు జనార్ధన్, ఎన్ సూర్యనారాయణ, ఆర్ సూరిబాబు, యు గంగ అప్పారావు, ఎం రమణ ఆర్ కేశవరావు పాల్గొన్నారు.

సాయినగర్ అభివృద్ధికి కృషి

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ముదిరాజ్ కాలనీ సాయి నగర్ అభివృద్ధికి కషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు అన్నారు. కాలనీ అభివృద్ధికి నిధి వసూలు, అలాగే రోడ్డు వేసేందుకు రూ.98 లక్షల ఎమ్మెల్యే నిధుల కోసం కొణతాల రామకష్ణను కలిసేందుకు తీర్మానించారు. నూతనంగా ఎన్నికైన కమిటీలో గౌరవాధ్యక్షులుగా డాక్టర్ కెఎస్ ఈశ్వరరావు, అధ్యక్షులుగా డాక్టర్ అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా జి గణేశ్వరరావు, కార్యదర్శిగా వి.మురళి, సంయుక్త కార్యదర్శిగా జి రవికుమార్, కోశాధికారిగా కె శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలుగా డి శాంతితోపాటు మరో ఏడుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

యువత చదువుపై దృష్టి సారించాలి



చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించి భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం క్రైస్ట్ విద్యాసంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.పదివేల ప్రోత్సాహక బహుమతి చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, వారిని ఉత్తేజపరిచారు. అనంతరం ఎమ్మెల్యే విజయకుమార్‌ను విద్యాసంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, డ్రీమ్స్ నాయుడు, ద్వారపురెడ్డి బాబ్జి, రెడ్డి చిరంజీవి, గణేష్, అప్పలనాయుడు, కె వెంకునాయుడు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలపై ప్రత్యేక దృష్టి

అచ్యుతాపురం : దిబ్బపాలెం పునరావాస కాలనీలో పదేళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పరిశీలించారు.. పాఠశాలలో తరగతి గదులు, మరుగుదొడ్లు, ఆటస్థలాన్ని పరిశీలించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు. జనసేన మండల శాఖ అధ్యక్షులు బి రాందాస్, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, నాయకుడు ద్వారపురెడ్డి బాబ్జి, డ్రీమ్స్ నాయుడు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఓటర్ల జాబితా సిద్ధం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని 23 మైనర్ ఇరిగేషన్ చెరువులకు 138 ప్రాయోజిత నియోజక వర్గ నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేసి ఆదివారం ఆయా గ్రామ సచివాలయాలలో అందుబాటులో ప్రచురించినట్లు స్థానిక తహసీల్దార్ బి. చిన్నికృష్ణ తెలిపారు. ఆయా ఓటర్ జాబితాలను పరిశీలించి, అభ్యంతరాలు, ఆక్షేపణలుంటే రెండు రోజుల్లో తహసీల్దార్‌కు తెలియజేయాలని కోరారు.

కోలాటం చిన్నారులకు బహుమతులు

ప్రజాశక్తి - యలమంచిలి : ఇటీవల రామనగర్‌లో జరిగిన ఉత్సవాల్లో కోలాటం ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులు రామనగర్‌కు చెందిన తేజు,మానస, సుస్మిత, మధు, వైష్ణవిలకు ఆదివారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేసినట్లు ఉత్సవకమిటీ అధ్యక్షులు లంక రాజు తెలిపారు. భవిష్యత్తులో కోలాట ప్రదర్శనలో వారికి మంచి తర్ఫీదు నిచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నూకరత్నం తెలిపారు.

వికలాంగులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి -రాంబిల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు మరిన్ని ప్రయోజనాలను కల్పించాలని వికలాంగుల సంక్షేమ సంఘ మండల కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సమావేశంలో వికలాంగులకు రైల్వేపాస్‌లు ఇవ్వాలని, ప్రస్తుతమున్న ధరల దృష్ట్యా వికలాంగులకు ఇస్తున్న నెలసరి సామాజిక పింఛను సాయం రూ.ఆరువేలు నుంచి రెట్టింపు చేయాలని కోరారు. వికలాంగ నిరుద్యోగులకు ప్రయివేటు సెక్టార్‌లో ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. సమావేశంలో మండల కమిటీ అధ్యక్షుడు ఎజ్జల అప్పలరాజు, సెక్రటరీ చింతకాయల తాతారావు, కోశాధికారి ఎరిపిల్లి నూకరాజు, కొండబాబు, పైడితల్లి పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ ప్రారంభం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని సుందరయ్య పేట గ్రామంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయం, అందులో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పీలా గోవింద సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి పార్టీ శ్రేణులు గొంతిని శ్రీను వాసరావు, కాయలు మురళి, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నైనముశెట్టి రమణ రావు, కర్రి సత్య నారాయణ, కర్రి దుర్గ నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిపిఎం ప్రజాపోరులో విస్తృత ప్రచారం

అనకాపల్లిలో ఇంటింటా కరపత్రాలతో సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : సిపిఎం ప్రజాపోరు యాత్రలో భాగంగా ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి నాలుగు రోడ్లు జంక్షన్ వరకు కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈసందర్భంగా సిపిఎం నేత కె.ఈశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, ధరాభారం, అనుసరిస్తున్న నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలీ ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 14 వరకు రాష్ట్రవ్యాపితంగా ప్రజాపోరు పేరుతో ఇంటింటా ప్రచారాన్ని సిపిఎం నిర్వహిస్తోందన్నారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు గండి నాయనబాబు, జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, శాఖ సభ్యులు ఎస్.నాగరమణ, పాంగి చలపతి, ఎం.రమణ, నాగిరెడ్డి సత్యన్నారాయణ, అర్జున్ పాల్గొన్నారు.

రాంబిల్లి :ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 14 వరకు నిర్వహించే ప్రజా పోరు వాల్‌పోస్టర్లను ఆదివారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం కొత్తపట్నం, రాంబిల్లి, చిన్న కలవలపల్లి గ్రామాలలో సిపిఎం కార్యకర్తలు ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు సిపిఎం నాయకులు ఎస్.నారాయణ రావు, చందక రామ కృష్ణ, ఎం శ్రీనివాస్, యు అప్పారావు, ఈ గంగాధర్ రావు, సిహెచ్ గంగరాజు, ఎస్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భానోజీతోటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రాంబిల్లిలో ప్రజాపోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

గాజువాక : ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గాజువాక భానోజీతోటలో సిపిఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీచేశారు. ప్రజాసమస్యలపై ఈ నెల 14వ తేదీన గాజువాక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సిపిఎం నాయకులు ఆర్.నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వర రావు, టి.శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, ఆర్.అప్పల నాయుడు, వి.మల్లేశ్వరరావు, ఎం.జ్యోతి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై
26న నిరసనను విజయవంతం చేయండి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో అధ్యక్షులు ఆర్ శంకరరావు అధ్యక్షతన అనకాపల్లి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం పోరాడగా, వాటిని రద్దు చేస్తానని మోడీ ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పన, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, నిత్యవసర వస్తువులు ధరలు తగ్గింపునకు చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ ప్రజలపై భారాలు వేశారన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్, సర్దుబాటు పేరుతో రూ.11 వేల కోట్ల విద్యుత్ భారాల ప్రజలపై వేసిందని మండిపడ్డారు.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ ప్రతిపాదన రద్దు చేయాలన్నారువీటన్నిటికీ నిరసనగా జిల్లా కేంద్రాల్లో జరుగు ప్రదర్శనలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, అడిగర్ల రాజు, జీ రేమండ్ నాయుడు, కే శాంతి,శివాజీ,డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యాన వైద్యశిబిరాలు

కంటివైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న దొరైస్వామి

ప్రజాశక్తి - అచ్యుతాపురం : బ్రాండిక్స్, రెడ్ క్రాస్ సహకారంతో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో 25 మంది కార్మికులు రక్తదానం చేశారు. బ్రాండిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 132వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మంది కంటి రోగులను నేత్ర వైద్య నిపుణులు పరీక్షించారు. ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. బ్రాండిక్స్ ఇండియా భారత భాగస్వామి దొరస్వామి రక్తదానం, వైద్యశిబిరాలను పర్యవేక్షించారు. కంటి రోగులతో మాట్లాడి అభిప్రాయాలను సేకరించారు. శిబిరానికి వచ్చిన రోగులకు తాగునీరు మజ్జిగ సమకూర్చారు.

కార్పొరేషన్ ఛైర్మన్లకు అభినందన

మళ్ల సురేంద్రను అభినందిస్తున్న టిడిపి, కూటమి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర గవర వెల్ఫేర్, డెవలప్‌మెంట్, కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మళ్ళ సురేంద్రను ఆదివారం ఆయన స్వగృహంలో అనకాపల్లి తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు మర్యాదపూర్వక కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మీదున్న అంకితభావానికి, అనకాపల్లి నియోజకవర్గంలో ఎన్నో ఏళ్ల నుంచి సురేంద్ర పడ్డ శ్రమకు ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించి కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చారన్నారు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ పదవి ద్వారా మళ్ల సురేంద్ర మరింత గుర్తింపును, గౌరవాన్ని పొందాలని, గవర కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి న్యాయం చేయాలని శు భాకాంక్షలు తెలిపారు.

కశింకోట : రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మళ్ల సురేంద్రను ఆదివారం తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, అచ్చెర్ల, తాళ్లపాలెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, చింతలపాలెం మాజీ సర్పంచ్ కర్రి దుర్గనాయుడు, కొన రమణ, కోన సత్తిబాబు, భీముని మోహన్, నారిపల్లి ప్రసాదరావు కలిసి, శు భాకాంక్షలు తెలిపారు.

ఆనందపురం : ఏపీ పొల్యూషన్ బోర్డు కార్యదర్శిగా నియమితులైన జనసేన భీమిలి ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్లకు, వీఎంఆర్‌డిఏ ఛైర్మన్‌గా నియమితులైన ప్రణవ్ గోపాల్‌కు వేములవలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ అభినందనలు తెలిపారు. వీరిద్దరూ కూటమి ప్రభుత్వం విజయానికి ఎంతో కృషిచేశారని, వారి కష్టాన్ని అధిష్ఠానం గురించి నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించడం ఆనందదాయకంగా ఉందన్నారు. కష్టపడే నాయకులకు, కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం తగిన గుర్తింపునిస్తుందని పేర్కొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఏపి కో - ఆపరేటివ్ ఆయిల్స్, సీడ్స్, గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమితులైన టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా కార్పొరేటర్లు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభినందనలు తెలిపారు. పార్టీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు తమ్మిన విజయ్ కుమార్, విల్లూరి డాక్టర్ చక్రవర్తి, మజ్జి త్రినాధరావు, బత్తి రాజశేఖర్, సారిపల్లి మహేష్, విల్లూరి తిరుమల దేవి అభినందనలు తెలిపారు.

అచ్యుతాపురం : రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన ప్రగడ నాగేశ్వరరావును ఆదివారం స్థానిక ఎంపీ సీఎం రమేష్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ లాలం భవాని భాస్కర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

మునగపాక : రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమితులైన ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాడి ముసలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, దొక్కా నాగభూషణం, వెలగా మురళి, ఆడారి లక్ష్మణరావు, దాడి శివ పాల్గొన్నారు.

ప్రగడను అభినందిస్తున్న మునగపాక టిడిపి, కూటమి నేతలు

నిలిచిన రహదారి పనులు

-రాళ్లు తేలడంతో అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట: మండలంలో పెదమదిన జంక్షన్ నుండి గున్నెంపూడి మీదుగా పిల్లవానిపాలెం వరకు వెళ్లే రోడ్డు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో సుమారు రెండేళ్లుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గతంలో తారు రోడ్డుగా ఉండేది. వాహనాల రాకపోకలతో గుంతలుగా మారి ప్రయాణానికి కాస్త ఇబ్బందిగా ఉండేది. గత ప్రభుత్వ హయాంలో నూతనంగా రోడ్డు నిర్మాణానికి 2023 వ సంవత్సరంలో ఒక కోటి 83 లక్షల 56 వేల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి నాటి శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ పనులు ప్రారంభించారు. సంబంధిత కాంట్రాక్టర్ జంక్షన్ నుండి పిల్లవానిపాలెం వరకు రోడ్డును మొత్తం తవ్వి విడిచిపెట్టారు. కొద్ది దూరం పిక్కా, డస్ట్ మిక్స్ చేసి రోలింగ్ చేసి విడిచిపెట్టారు. మిగతా రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలుగా మరి వాహనాల రాకపోకలకు ఏమాత్రం అనుకూలంగా లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ రోడ్డు గుండా వందలాది వాహనాదారులు ద్విచక్ర వాహనాలు, ఆటోల పై నిత్యం అనకాపల్లి కి రాకపోకలు సాగిస్తారు. ఈ రోడ్డు గోతులు, రాళ్ళు తేలి ఉండటంతో వాహనదారులు తమ వాహనాలు మరమ్మతులు గురవుతున్నాయని వాపోతున్నారు. నూతన ప్రభుత్వంలోనైనా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని వాహనదారులు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

గ్రావెల్ రాళ్లు తేలిన రహదారి

గత ప్రభుత్వంలో వేసిన శిలాఫలం

పౌష్టికాహారం అందజేస్తున్న పద్మావతి

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :భగవాన్ శ్రీ సత్య సాయిబాబా 100వ జయంతి సందర్భంగా గర్భిణులకు ప్రతినెలా పండ్లు, ఎండు ఫలాలను సత్య సాయి సేవా సంస్థల సహకారంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో తెదేపా కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ, సత్యసాయి బాబా సేవ సంస్థల సేవలను కొనియాడారు. ఆసుపత్రిలో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసుల వాడకాన్ని నిరోధించాలని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ సత్యనారాయణకు పద్మావతి సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు వడలి రామచంద్రరావు, పిట్టా రామకష్ణా రావు, సాయిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అఖండనామ సంకీర్తన సత్యసాయి మందిరంలో ప్రారంభించామని తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

బాలికకు రూ.25 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో అనారోగ్యంతో బాధపడుతున్న బాలికకు రూ.25వేలు ఆర్థిక సహకారం చేశారు. సంస్థ అధ్యక్షులు టి.మల్లేష్ మాట్లాడుతూ, స్థానిక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న సి.హెచ్. సాహిత్య అనే బాలిక ఆడుతూ ఇనుప రాడ్ పై పడి దెబ్బ తగిలి గాయాలు అవ్వడంతో విశాఖపట్నం ఐకాన్ హాస్పిటల్ లో చేర్పించగా ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలియజేశారు. దీంతో, ద్రాక్షాయిని, పుష్పలత అనే ఉపాధ్యాయుల ద్వారా విషయం తెలిసి ఆర్థిక సహకారం అందించామన్నారు. ఆర్థిక సహకారం చేసిన హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులకు అమరావతి స్కూల్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పి.చిట్టియ్య, పి. లక్ష్మణరావు, హరిదేవ్, లక్ష్మయ్య, శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్లాస్, బౌల్‌ను అందజేస్తున్న రమణ

అంగన్వాడీ కేంద్రాలకు సామగ్రి అందజేత

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు అంగన్వాడీ సెంటర్లను ఈ మధ్యకాలంలో ఇదే గ్రామానికి చెందిన సచివాలయ కార్యదర్శి అనిమిరెడ్డి రమణ సందర్శించారు. దీనిలో భాగంగా పిల్లలు గుడ్లు తినేటప్పుడు, పాలు తాగేటప్పుడు కింద పడేయడం గమనించిన రమణ ఈ నాలుగు అంగన్వాడీ సెంటర్లకి పాలు తాగడానికి ఒక స్టీల్ గ్లాసు, గుడ్డు తినడానికి ఒక బౌలును పిల్లలందరికీ ఏర్పాటు చేయాలని భావించారు. దీంతో ఈ నాలుగు అంగన్వాడీ సెంటర్లకు సంబంధించి అంగన్వాడీ టీచర్లకు ఈ సామాగ్రి తన సొంత నిధులతో వీటిని ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నవతర గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు సబ్బవరపు లక్ష్మీనారాయణ (పోలీస్) తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న రేంజ్ అధికారి, ఉద్యోగులు

అటవీ అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ :మండలంలోని కృష్ణదేవిపేట అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమర వీరులకు జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ రేంజ్ అధికారి పి.శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ అధికారి వి.సత్యనారాయణ మాట్లాడుతూ, విధి నిర్వహణలో మరణించిన అటవీ అధికారులను స్మరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా అటవీ సిబ్బంది రాత్రి సమయంలో స్మగ్లర్లను పట్టుకునేందుకు గస్తీ నిర్వహించేటప్పుడు ఏ ఒక్కరు కూడా అలసత్వం లేకుండా అందరూ మూకుమ్మడిగా వెళ్లేందుకు ప్రయత్నించాలన్నారు. అలాంటప్పుడే స్మగ్లర్లు తమపై దాడులు చేసేందుకు వెనుకంజ వేస్తారన్నారు. స్మగ్లర్ల దాడిలో గతంలో రాష్ట్రవ్యాప్తంగా 23 మంది అటవీ అధికారులను మృతి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ కెవి.రమణ, ఎఫ్‌బి ఓటి గౌరేష్, ఏబిఓ బి.రాణి, ఏబిఓ గణపతి, ట్రెకింగ్ ఫోర్సు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్ల మరమ్మతు పనులు

ప్రజాశక్తి - చింతపల్లి:రెండు తాగునీటి బోర్లకు మరమ్మతు నిర్వహించి వినియోగంలోకి తీసుకు రావడం జరిగిందని ఎర్రబొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, కొండవంచల గ్రామంలో తాగునీరు అందించే రెండు బోర్లు మరమ్మతుకు గురై గడచిన ఐదు నెలలుగా నీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అధికారులతో మాట్లాడి ఎట్టకేలకు బోర్లను మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు బేరా సత్యనారాయణ, చిన్నబ్బాయి పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- కోటవురట్ల:కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటర్లుగా నమోదు చేసి ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తహసిల్దార్ తిరుమలబాబు తెలిపారు. ఆదివారం ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా పిఎస్ నెంబర్ 9, 10 నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బి ఎల్ వోలు ఓటర్ జాబితాలో పేర్లు గ్రామస్తులకు చదివి వినిపించాలన్నారు. కుటుంబ సభ్యులు ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్ లో ఉండే విధంగా చూడడంతో పాటు, ఫోటో సక్రమంగా లేని వారికి ఫోటో తీయాలన్నారు. ఇంటి నెంబరు, వయసు సక్రమంగా ఉందో లేదో చూడాలని, చనిపోయిన వాళ్ళ పేర్లు తొలగించాలని సూచించారు. తప్పులు లేకుండా ఓటర్ జాబితా తయారీకి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల వ్యాప్తంగా 52 పోలింగ్ బూత్‌ల వద్ద నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి పెద్దన్న దొర తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహశీల్దార్

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జి.రవి ఆదివారం స్థానిక ఐదు రోడ్ల జంక్షన్ లో శాఖా గ్రంథాలయంలో జరిగిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రవి ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పాఠకులతో చర్చించారు. ఇప్పటి నుండే పోటీ పరీక్షలకు ఎలా సిద్ధపడాలో విద్యార్థులకు తెలియజేశారు. పోటీ పరీక్షలకు చదువుచున్న యువత ఎలా ప్రిపేర్ అవ్వాలో సూచనలు ఇచ్చారు. క్విజ్ ప్రశ్నపత్రములను అందచేశారు. పిల్లలు బాగా చదువుకోవాలని గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆయనను పాఠకులు, యువత గ్రంథాలయాధికారిని దమయంతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ నెల 14 నుండి 20 వరకు జరుగనున్న గ్రంథాలయవారోత్సవాలకు రావాలని ఆమె కోరారు.

గొలుగొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లలతో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. రాజుబాబు మాట్లాడుతూ, ప్రతీ ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం అలవాటు చేసుకోవాలన్నారు.

గొలుగొండలో చదువుతున్న విద్యార్థులు

క్వారీ ప్రాంతాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రంగురాళ్ల క్వారీలో తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టిపాలెం రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు జరుగుతున్నాయని వచ్చిన సమాచారం మేరకు శనివారం రాత్రి ఈ క్వారీని గొలుగొండ తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎస్సై పి.రామారావు పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ, పోలీస్, రెవెన్యూ సిబ్బంది 24 గంటలు కాపలా ఉన్నారని, ఎటువంటి రంగు రాళ్ల తవ్వకాలు జరగలేదని ఆయన తెలిపారు. పోలీస్, రెవిన్యూ సిబ్బందితో పాటు ఫారెస్ట్ సిబ్బందిని కూడా నియమించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎస్సై పి.రామారావు మాట్లాడుతూ, రంగురాళ్ల తవ్వకాలు జరపలేదని షెడ్ వేసుకొని ఇక్కడే కాపలా ఉండడం జరుగుతుందని ఆయన తెలిపారు. కొంతమంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

దగ్ధమైన పరికరాలు

పేలిన గ్యాస్ సిలిండర్

ప్రజాశక్తి-రోలుగుంట:మండల కేంద్రంలోని మెయిన్ స్కూల్‌లోని అంగన్వాడీ కేంద్రంలో గ్యాస్ సిలిండర్ పేలి భవనం గోడ కూలిపోయింది. ఆదివారం సెలవుదినం అంగన్వాడీ కేంద్రం తెరవక పోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. ఈ గదిలో మూడు సెంటర్ల తాలుకా మూడు సిలిండర్లు ఉండగా ఒక సిలిండర్ దగ్ధమై శబ్ధం రావడంతో గ్రామస్థులు వచ్చి వెంటనే అగ్నిమాపక కేంద్రంకు ఫోన్ చేశారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. మిగతా రెండు సిలిండర్ బండలు పైకి తీసి వేయడంతో ప్రమాదం తప్పింది.



నిరుపయోగంగా ఉన్న నిఘానేత్రం

అలంకారప్రాయంగా నిఘా నేత్రం

ప్రజాశక్తి -కోటవురట్ల:తహసిల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరా(నిఘా నేత్రం) అలంకారప్రాయంగా దర్శనమిస్తుంది. గడిచిన ఐదు సంవత్సరాలుగా నిర్వహణ గాలికి వదిలేయడంతో సీసీ కెమెరా పని చేయలేదని కార్యాలయ వర్గాలు తెలియజేశాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఆర్డీవో కార్యాలయానికి అనుసంధానమై ఉన్నట్లు తెలిపారు. సీసీ కెమెరా ఏర్పాటు అనంతరం పర్యవేక్షణ పట్టించుకోకపోవడంతో రికార్డ్ రూముకు భద్రత కరువైంది. ఇటీవల కాలంలో మదనపల్లి రెవెన్యూ రికార్డుల దగ్ధం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్న తరుణంలో ప్రతి కార్యాలయానికి భద్రత నిమిత్తం ప్రభుత్వం ప్రతి రూముకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలు సంఘాల నాయకులు, రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

హాకీ టోర్నీ విజేతలు కడప, విశాఖ

- ఉత్సాహంగా ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ అండర్-14 బాల బాలికల రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలు స్థానిక హాకీ క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఘనంగా ముగిసాయి. రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో విజేతలుగా బాలికల విభాగంలో ప్రధమ స్థానం కడప, ద్వితీయ స్థానం విశాఖపట్నం, తృతీయ స్థానం చిత్తూరు జిల్లాల జట్లు, బాలురు విభాగం లో ప్రధమ స్థానంలో విశాఖపట్నం, ద్వితీయ స్థానం కడప,

తృతీయ స్థానంలో చిత్తూరు జిల్లాల జట్లు విజయం సాధించాయని ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన జట్లు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన జట్లు డిసెంబర్ 8 నుండి 13 వరకు మధ్య ప్రదేశ్ లోని మాండి సోరి గ్రామంలో జరిగే జాతీయ హాకీ టోర్నమెంట్ లో పాల్గొంటారన్నారు.

ఈ టోర్నమెంట్‌లో 13 జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీలు హెూరా హెూరీగా జరిగాయి. సర్పంచ్ జయ రత్నకుమారి, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ , బిజెపి మండల శాఖ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్, స్టేట్ అబ్జర్వర్ థామస్, ఎంఈఓ లు కే నరేష్, వేమగిరి నూకరాజు, బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, పిఈటి అసోసియేషన్ సెక్రెటరీ .కే.ఎం నాయుడు, సి.హెచ్ వెంకటరావు, కొల్నాటి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

బాలురు విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖపట్నం జట్టుకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

హోరా హోరీగా ఆడుతున్న క్రీడాకారులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై పోస్ట్‌కార్డు ఉద్యమం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభమైంది. ఆదివారం ఉదయం విశాఖ బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్దకు వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి ఈ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చెయ్యొద్దని ప్రధాని నరేంద్ర మోడీని కోరుతూ ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ చేపట్టిన పది లక్షల పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని ప్రజలు స్వాగతిస్తూ పోస్ట్ కార్డులపై సంతకాలు చేసి సంస్థ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి మీడియాతో మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయిస్తే లాభాల బాటలో నడుస్తుందని తెలిపారు.విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుండి పోస్టు కార్డుల ఉద్యమానికి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు.

ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాలుగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరాహార దీక్షలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారుమీ కార్యక్రమంలో పిఓడబ్ల్యు వెంకటలక్ష్మి, మహిళా సంఘం నేత లలిత, భారత నాస్తిక సమాజం నాయకులు వై నూకరాజు, జే రవి, రాం ప్రభు, సునీత, బీమ్ సేన్ వార్ డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, ముస్లిం నేతలు మహమ్మద్ ఆశిక్, మహమ్మద్ మున్నీర్, డాక్టర్ పి సుబ్రహ్మణ్యం, స్టీల్ ప్లాంట్ నాయకులు శ్రీనివాస్, విశాఖ సిటిజన్ ఫారం ప్రెసిడెంట్ పి ఎన్ తిలక్, గాయత్రీ కళాశాల డైరెక్టర్ డి గిరిధర్, న్యాయవాది అశ్రఫ్, సినీ కళాకారుల సంఘం అప్పారావు, సంఘాల నేతలు పాల్గొన్నారు.

పోస్టు కార్డు ఉద్యమం చేపడుతున్న వివి.రమణమూర్తి

8 నుంచి విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ డెవలప్మెంట్ అసోసియేషన్ తొలిసారిగా డిసెంబర్ 8 నుండి 11వ తేదీ వరకు విశాఖపట్నం హిందుస్థాన్ జింక్ క్రికెట్ మైదానంలో దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని 10 జిల్లాల నుండి 10 టీములు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. దివ్యాంగుల క్రికెట్ సెంట్రల్ బోర్డుకు అనుబంధంగా ఉన్న ఎపి స్టేట్ దివ్యాంగుల క్రికెట్ డెవలప్మెంట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న,ఈ పోటీలకు ప్రముఖ సోషల్ యాక్టివిస్ట్ ఉరుకూటి చైతన్య రూ.లక్ష,70 వ వార్డు టిడిపి ఇన్చార్జి చట్టి గోపి రూ.25 వేలు విరాళంగా ఇచ్చారు.ఈ పోటీలను ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్నట్లు ఊరుకూటి చైతన్య తెలియజేశారు. ఆదివారంవిజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా జరుగుతున్న దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గాజువాక సమీపంలోని జింక్ మైదానం జరుగు దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు అన్నీ ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ బ్రోచర్ ను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాస్ బ్రాడ్కాస్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈరోతి ఈశ్వరరావు, వందే భారత్ బ్లడ్ బ్యాంకు అధినేత వినోద్ బాలు టోర్నమెంట్ నిర్వాహకులు మణికంఠ,హేమ సుందర్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

చాపరాయిలో పర్యాటకులు

చాపరాయి కిటకిట

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:కార్తీక మాసం ప్రారంభం కావడంతో మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో, చాపరాయి జలపాతం పర్యాటకులతో కిటకిటలాడింది. ఇక్కడ సందర్శించిన పర్యాటకులు జలపాతంలో స్నానాలు ఆచరిస్తూ ఆనందంగా గడిపారు. గార్డెన్‌లో ఫోటోలు తీయించుకుంటూ పర్యాటకులు ఆనందంగా గడిపారు. జలపాతం నుంచి అరకు వరకు నిన్న చెట్టు నీడల్లో వనభోజనాలు చేసి ఆటపాటలతో సందడి చేశారు.